


# శకటం

ఆనంద్ కుమార్

'మూసా! ఒక్క ఆట వేద్దామా?' అన్నారు పూర్ణచంద్రరావుగారు.

'చిత్తం!' అన్నాన్నేను

కిటికీనుండి మలయసమీరం చిరునవ్వులు చిందుకుంటూ తొంగిచూసింది. అక్కడ, దూరంగా గేటువగ్గరున్న బోగన్‌విలియా — మధ్యలోనే కొన్ని నవ్వుల నేరుకుని కెంపులు పూసింది. గేటు మీద ఆ కెంపుల్ని చూసి ఏరుకుందామని మొహమంతా చిరునవ్వు పులుముకుని చింపిరి జుత్తు నెగదోసుకుంటూ గుండెల్లోని దైన్యాన్ని, కళాకాంతుల్లేని చర్మంతో కప్పుకుని బిలబిలమంటూ వచ్చారు కొంతమంది పిల్లలు.

వాళ్ళను చూచే గామాలు 'టైగర్' గుర్రుమంది, ఇంటి ముందునుండి.

నా ముందు చిన్నని గుండ్రటి బల్ల మీద చదరంగం పరిచాడు పనిపిల్లవాడు. అట్టపెట్టెలో పడివున్న పావుల్లోంచి పచ్చ వాటిని తీసి అమర్చుకుంటున్నాను.

టైగర్ ఈ సారి గట్టిగా మొరిగింది కిటికీలోనుండి బయటకు చూశాను. ఈ సారి పిల్లలు దూరంగా పరుగెత్తారు.

గేటుదగ్గిర పిల్లలు తప్పితే ఇంకేమీ కనపడటంలేదు. ఎత్తయిన ప్రహారీ గోడ తప్ప. ఇంటిముందు నినాదాల్లా పెరిగిపోయిన బోగన్‌విలియా చెట్లమీద పిట్టల కిచకిచలూ... రోడ్డు మీద... తల్లి రొమ్ములో పాలు లేకపోవడం చూసి ప్రేవులు తెగిపోయేట్లు ఏడిచే బిచ్చగత్తె కొడుకు ఏడుపులూ ఇంతదూరం... ఇక్కడకు వినిపించవు.

అప్పుడప్పుడు అరమూసిన కన్నులతో, 'అమృతం' నిండిన జీర్ణకోశంతో, నచ్చిన అతివల పయ్యెదల మధ్య చిక్కపడి పూర్ణచంద్రరావుగారు వేసే భాగోతపు వేషాలన్నీ బయటవాళ్ళకు కనిపించవు... వినిపించవు.

అంత పకడ్బందీగా కట్టిన మేడ ఇది.

నేను పూర్ణచంద్రరావుగారి గుమాస్తాని. వారికి నా మీదున్నంత నమ్మకమూ, ప్రేమా వారికి వారి భార్యమీద కూడా లేదు. అయినా రోగిష్టిదానిమీద ప్రేమేమిటి లెండి! కాని, వారి ధర్మపత్ని సాక్షాత్తూ మహాలక్ష్మి. (అందునా అనారోగ్యంగా వున్న వారి గూర్చి చెడు మాట్లాడటం నాకు సుతారమూ గిట్టదు) ఆమెగారు మేడదిగి ఎన్నడూ కిందకు రాలేదు. పూర్ణచంద్రరావుగారు మేడ ఎక్కి ఆమె గదిలోకి ఈ మధ్య ఎన్నడూ వెళ్ళలేదు.

ఇంటి కుక్కను చూసి యజమాని గుణగణాలను వివరించవచ్చని అన్నారెవరో - కాని నన్నడిగితే ఇది సమంజసం కాదేమో ననిపిస్తుంది. ఇంటి ముందు చీటికీ మాటికీ గుర్రుమనే 'టైగర్'లా కాకుండా ప్రశాంతంగా నిదురబోయే 'టైగర్ లాంటి మనిషి పూర్ణచంద్రరావుగారు. వా రన్నమాట తప్పరు. ఆకలివేస్తే తప్ప నిద్రలేవరు. మనుషుల్ని మెల్లగా దువ్వుతూ, బుజ్జగిస్తూ మాట్లాడ్తారు.

పూర్ణచంద్రరావుగారు నా కెదురుగా వచ్చి కూర్చున్నారు. కుడినుండి మూడో వేపున్న గదిలోని ఎర్ర సిపాయిని ముందుకు కదలిస్తూ పనిపిల్లవాడి వేపు చూసి 'పోతులూరు వచ్చాడుర్రా?' అని అడిగారు.

'రాలేదయ్యగోరూ!—' అని జవాబిస్తూనే వున్నాడు పనిపిల్లవాడు - 'దండాలండీ' అన్నాడు పోతులూరు.

'రావయ్యా రా! ఇప్పుడే నీ గురించి అడుగుతున్నాను—' అంటూ పనిపిల్లవాడ్ని వెళ్ళిపోమని సైగ జేశాడు పూర్ణచంద్రరావుగారు.

పోతులూరు వేపోసారి దృష్టి సారించాను. వాణ్ణి చూసినప్పుడల్లా నాకు జాలి వేస్తుంది. అందే పోతులూరు అర్భకుడనీ కాదు, అసమర్థుడనీ కాదు. వయసు మళ్ళిన వాడనీ కాదు.

'కండగలవాడేను మనిషోయ్ —' అన్న చరణం పోతులూరుకు అక్షరాలా సరిపోతుంది. ఆతడ్ని చూసినాక ఒలింపిక్స్‌లో పాల్గొనాల్సిన మల్లయుద్ధ ప్రవీణుడ్ని భారతదేశం పొరబాటున వదిలేసిందేమోనన్న అనుమానం వస్తుంది. చర్మాన్నంతా సాగదీసి కండలమీద బిగించినట్లుంటుంది వాడి శరీరం. దానికి తోడు అందమైన కోల మొహమూ, పెద్ద పెద్ద కళ్ళూ, కోర మీసమూను.

పోతులూరు చెంపమీద దెబ్బపడితే రెండో చెంప చూపిస్తాననే మనిషీ కాదు.




కోపం వచ్చిందంటే అది పరశురాముడి కోపమే. పట్టినపట్టు విడవాలంటే పోతులూరు తర్వాతేను భగీరథుడు.

అయితే ఇంకెందుకయ్యా జాలి?

ఇంతటి మనిషీ పూర్ణచంద్రరావు గారిని చూస్తే పిల్లిలా మారిపోతాడు వంగిపోయి నడుస్తాడు. ఆంజనేయుని భక్తినైనా శంకించాలేమోగాని పోతులూరు స్వామి భక్తిని శంకించలేం. అయితే స్వామి భక్తి వుండటం నేరం గాదు. ఆ స్వామిగా రెటువంటి వారనేదే ప్రశ్న.

వాడి నేరమల్లా (నా దృష్టిలో) వాడి భార్య అనసూయకూ, పూర్ణచంద్రరావు గారికీ వున్న సంబంధం తెలిసీ వాడు మిన్నకుండటం. మనిషిని మనిషి అర్థం చేసుకోవటం బ్రహ్మవిద్యేనని - అనుకుంటాను. నా బేగం సాహెబా రెండు మూడుసార్లు నన్నడిగింది. 'ఈ విషయం

పోతులూరుకు తెలవదా ?' అని. కాని, సమాధానం నే నివ్వలేను.

పూర్ణచంద్రరావుగారూ, నేనూ చిన్నప్పుడు ఒకే బడిలో చదువుకున్నాం. కాని, మా ఇద్దరి మధ్యా అంతస్థు అడ్డం వచ్చేది. చిన్నతనాన కలిసిపోయినప్పటికీ జ్ఞానం వస్తుండేసరికి మా మాటల్లో, చేతల్లో, పెద్దవాళ్ళ మందలింపులలో ఈ భేదం ప్రస్ఫుటంగా కనపడటం మొదలైంది.

మా నాన్నగారు పూర్ణచంద్రరావుగారి నాన్నగారి దగ్గర గుమాస్తాగా పని చేశారు. పూర్ణచంద్రరావుగారి పొలాల మీదా, ఇండ్లమీదా అజమాయిషీ మా కుటుంబానికి తరతరాలుగా వస్తున్నది. వారికి సంబంధించిన తహసీలు వ్యవహారాలన్నీ మేమే చూస్తాం.

మా నాన్నగారు గతించిన తర్వాత వారసత్వంగా, ఆ గుమాస్తాగిరీ నాకు సంక్రమించింది. మా నాన్నగారి తరానికీ, మా తరానికీ భేదం ఏమిటంటే మా నాన్నగారు పూర్ణచంద్రరావుగారి నాన్నగారితో చదరంగం ఆడేవారు కారు. నేను ఆడుతున్నాను.

శకటాన్ని ముందుకు నెడుతూ పోతులూరు నడిగారు పూర్ణచంద్రరావుగారు, 'ఏమయిందిరా నీ కప్పగించిన పని ?' అని.

మాట్లాడలేదు పోతులూరు.

'ఏం ? దారికి రాలేదా ?'

పోతులూరు చిన్నగా నవ్వాడు. 'దొరా! మీ బంగళావుంది. అమావాస రాతిరుంది. అందకుండాపోతే పట్టుకుంటానికి పోతులూరూ వున్నాడు–' అని కోరమీసం దువ్వాడు.

పొడుపు కథల్లో మాట్లాడుకుంటున్నారు ఇద్దరూనూ.

'ఎప్పుడింక?–' అన్నారు పూర్ణచంద్రరావుగారు.

వారి శకటం ముందుకు చొచ్చుకుని వచ్చి నా పచ్చ సిపాయిల్లో ఒకదాన్ని తినేసింది.

'రేపు మీరే చూస్తారు దొరా!'


నవ్వేశారు పూర్ణచంద్రరావుగారు. 'చూస్తూనే వున్నాను గదరా–' అన్నారు.

పోతులూరు వెళ్ళిపోయాడు.

'నా శకటం వీరవిహారం చేస్తున్నది మూసా!' అన్నారు పూర్ణచంద్రరావుగారు.

తూరుపు దిక్కునుండి గాలి ఉధృతంగా వీచింది. కిటికీరెక్కలు టపటప కొట్టుకుంటున్నాయి.

రెండ్రోజుల తర్వాత ఊరిమీద కాకులు విచ్చలవిడిగా ఎగిరాయి. కాకుల్ని చూస్తే నాకు భయం. దేనికైనా తట్టుకుంటానేమో గాని కాకిగోలని తట్టుకోవాలంటే నాకు గుండె సరిపోదు. కాని, ఊరవతల పాడుబావిలో కనిపించిన వరలక్ష్మి శవం కాకిగోలకు సమాధానం చెప్పకుండా ఉలక్కుండా పడివుంది.




ఆ సాయంత్రానికి అనుమానంమీద పోతులూరు అరెస్టయ్యాడు. మాఇంటిలో నా బేగం సాహెబా 'ఇది పూర్ణచంద్ర రావుగారు పని-' అంది.

'ఛస్!' అన్నా న్నేను. నా ఒంట్లోని ఉప్పు ఇగిరిపోలేదనుకుంటాను. ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలవేళ కొన్ని వ్యవహారాలు మాట్లాడటానికి పూర్ణ చంద్రరావుగారి ఇంటికి వెళ్ళాను. టైగర్ నన్నుచూసి తోకాడించింది. ఈ జంతువులకు ఎంత విశ్వాసం!

ఆకాశంలోని నక్షత్రాలు అలవాటు ప్రకారంగానే నవ్వుతున్నాయి. టోగన్ విలియాపూలు గాలిపాటకు యధావిధి గానే లయవేస్తున్నాయి.

లోపలకు వెళ్ళబోయిననాకు ముందు గదిలోనే అనసూయ తారసిల్లింది. చక్కగా అలంకరించుకుని వుంది.

అందం! అనసూయ పుట్టినాక అందం పుట్టింది.

నన్నుచూసి నవ్వుతూ- 'దొరగా రిప్పుడు మాట్టాడరు-' అంటూ లోపలి కెళ్ళిపోయింది. ఉస్సురని నిట్టూర్చి వెను దిరిగి వచ్చాను.


పోతులూరు కేసు విచారణలో ఉన్న ప్పుడు ఒకరోజున చదరంగం ఆడుతూ పూర్ణచంద్రరావుగారు నాతో అన్నారు- "మన జీవితాలు చదరంగం ఆట లాంటివి-" అని.

"పాతమాటే సుమీ!" అనుకున్నాను మనసులో.

'ఆటలో కొన్ని జంతువులు బలయి పోతుంటాయి-'

నిజం!

'నే నెప్పుడూ ఎక్కువగా ఉపయో గించే శకటమూ యిచ్చేస్తుంటాను అప్పు




తప్పదూ–' తప్పదు మరి కొన్నిసార్లు.

"మన ఉప్పు తినేవాళ్లను మనం ఉపయోగించుకోవడం తప్పుకాదు. ఏమంటావ్?"

ఖురానూ, బైబిలూ, భగవద్గీతా– నాకేవీ గుర్తురాలేదు.

నా బేగంసాహెబా నాతో అంది. "పోతులూరుకు అనసూయంటే చాలా ప్రేమ. దానికోసం ప్రాణం పెడతాడు"

నిజం కావచ్చు. కాని, అనసూయ పూర్ణచంద్రరావుగారికోసం ప్రాణం పెడుతుంది మరి!

ఆకాశం పడిపోలేదు. భూమ్మీంచి చంద్రుడి మీదకు మానవుడు గంతు వేసాడు.

కొన్నాళ్ళకు మళ్ళీ పూర్ణచంద్రరావుగారితో ఆటాడ్తున్నప్పుడు నా ఎర్రని పావుల్ని చూస్తుంటే శకటాన్ని ఆప్యాయంగా నిమురుదామని నా చేయి ముందుకు వచ్చింది.

ఆ తర్వాత నా అంతరాంతరాలలో మెదిలిన ప్రశ్న ఇది.

"ఇప్పుడిక శకటం ఎవరు?"

"అల్లా! నేను కాదు గదా!"